

# మా యిస్కూలు యానివసరీకి దుమ్ము లేపేసినా!

మూషిక వాహన మోదక హస్త
చామరకర్ణ విలంబిత సూత్ర
వామనరూప మహేశ్వర పుత్ర
విఘ్న వినాయక పాద నమస్తే...

యిదీ మా యిద్యానికేతన్ కాన్మెంట్‌లో రోజూ పాడే ప్రార్థన.

యీ మాత్రపు సంబడం ప్రార్థనని పాడించేదానికి మా అయిదో కిలాసులోని గోదాలక్ష్మి, పొట్టి బుడంకాయ ఆర్కాట్ కళావాణి ఎన్నెన్ని శకలు పడేవాళ్లో తెలుసునా?

గొంతు సన్నంగా పెట్టి, నోరు తెరిస్తే సవర్లకు సవర్ల బంగారం రాలిపడిపోద్దేమో అన్నంత వయ్యారంగా మూతి పెట్టి, ఒకో లైనూ చెప్పడం- వంత పాడుతున్న మా అందరితట్టు

బెట్టుసరిగా చూడటం, దీర్గం తీసి యింకో లైను చెప్పడం- చూసినారా మేమెంత క్లవర్లమో అన్నట్టుగా ముసిముసిగా నవ్వడం- యిదే దరువు.

వాళ్లిద్దరి మిడియాలం చూస్తా వుంటే నా కడుపు కాలిపోతా వుండేది. దేవుడు యిట్టాంటి గొంతుని నాక్కూడా యిచ్చినాడు కదా యీ ప్రార్దన నేను మాత్రం చేయించలేనా అని బాదపడని రోజులా.

కానీ ఎవురితో చెప్పుకునేది?

ఇస్కూలు హెడ్ మిసెస్సు రమాదేవి టీచరుకీ, ఇంగిలీషు చెప్పే శశిప్రబ టీచరుకీ నేను యిస్కూలుకి సరిగ్గా రానని పీకల్దాకా కోపం. లెక్కలు చెప్పే మాల్యాద్రయివోర్కైతే మన మీద ఏకంగా పగే. ఒంగోపెట్టి వీపు మీద పెంచటాలు, బాగాహారాలు చేయించడానికి తప్పితే యింకో పనికి మన దెగ్గిరకు రానుగాక రాడాయన. సోషలు చెప్పే రుక్మిణీ టీచరు దెగ్గిర రొంత చనువుందిగానీ నా చేత ప్రార్దన చేయించమని చెప్పే అద్నాట్టీ ఆమెకి లా.

అందుకే కడుపులో బాదని కడుపులోనే దాచుకొని 'ఏనాటికైనా నేను కూడా మీలాగా ప్రార్దన చేయిస్తా... చూస్తా వుండండి లమిడీల్లాలా' అనుకుంటా ఉండేవాణ్ణి. ఆ రోజు కూడా అట్నే అనుకుంటా ప్రార్దనయ్యాక కిలాసులోకి వెళ్లి కూచుంటే అయిదు నిమిషాల్లో చెప్పులాడించుకుంటా వచ్చింది రమాదేవి టీచరు.

'యియ్యాల కిలాసులా. నాకు యానివసరీ డే పనుంది. మీరంతా పుస్తకాలు తీసి చదవతా కూచోండి. శబ్దమొచ్చిందో చెమ్డాలు తీస్తా' అని బెత్తం ఆడించింది.

ఆనేక అందరితట్టూ చూస్తా 'మీలో యాక్షను చేసే యింటరెస్టు ఉన్నోళ్లంతా లేచి నిలబడండి' అనింది.

ఆ మాటామె అన్నదే తడవు కాండూరి మురళీగాడూ, కందుల మాలకొండ రావుగాడూ, గోదాలక్ష్మీ, పార్వతీ, ఎన్.మానస (యీళ్లంతా మా కిలాస్‌లో క్లవర్లు. ఏ ఫైనాసరే యీళ్లు చేసి పార్నాకగలరని మా రమాదేవి టీచరికి నమ్మకం) టకటకా లేచి నిలబడిపొయ్యారు.

నా గుండెకాయ గుబగుబలాడింది.

మన సత్తవ చూపించాలంటే యిదే చాన్సనుకొని మెల్లగా నేను కూడా లేచి నిలబడినాను.

నన్ను చూడటంతోటే రమాదేవి టీచరు నవ్వు మొకం పెట్టింది.

''నీకు తెలుగేమి వచ్చురా 'నీకీ నాకీ', 'మాకీ మీకీ' ముండా? ఇస్కూలికి సరిగా రారా నాయినా అంటే రాడుగానీ అయ్యకి డ్రామాలు కావాల్సొచ్చినాయే'' అనింది నవ్వతా.

(ఆగస్టు పదిహేనుకి రంగుకాయితాలు కడతా 'పురికోస విరగ్గొట్టేదా టీచర్' అని అడిగినప్పటి నుంచి ఆమెకి నా తెలుగు బాషంటేనే నవ్వు).

నేను మొకం చిన్నగా పెట్టుకొని కూచునేసినాను. కిలాసంతా గొల్లుమని పాళ్లు బయటపెడతా నవ్వింది.

గోర అవమానం! పోయిన సమచ్చరం నాలుగో కిలాస్‌లో కూడా యిదే అవమానం!

యానివసరీ డేకి క్లవర్ల చేత నాటకాలేయించడం, రిహల్సల్సుకని వాళ్లకు మాత్రం పొద్దున రెండు సాయింత్రం రెండు హాయిగా కిలాసులు ఎగనూకించడం, మాబోటి మొద్దు నాయాళ్లందరినీ కూచోబెట్టి సాది సాది చదివిస్తా వుండటం- కొత్తయితే కదా.

మొద్దుల్లో మిగిలినోళ్ల సంగతన్నా కాస్త నయంగానీ నా బతుకు మరీ హీనం.

మా కిలాస్‌లో క్లవర్లు ఎట్టా నాతో మాట్లాడకపోయినా మొద్దు నాయాళ్లలో కూడా సగం మంది మాట్లాడేవారు కాదు. పైగా నేనంటే వాళ్లకి కిండలు.

మడతలు పడిపోయి- నల్లంగా మాసిపోయిన యూనీఫారమ్ వేసుకొస్తాననీ (మూడు నెల్లు పంతం పట్టినా రెండు జతల యూనీఫారమ్ కుట్టించలాకపోయిన మా నాయిన్ను ఏం చేసినా పాపంలా), చెడ్డీలు వెనకతట్టు చిరిగిపోతే లోపల్నించి పిన్నీసులు పెట్టుకుంటాననీ (కుట్టడానికి దారం దొరక్కపోతే టెంపరరీగా మా నాయినమ్మ చేసేదట్ట) వాళ్లందరికీ బలే చిన్న చూపు.

హోమ్ వర్కు చేయక, క్యారేజీ రెడీకాక (రెడీగాకా పాడా? వండక) ఇస్కూలు ఎగనూకినందుకు 'బడికిరాని మొద్దు- చదువురాని ఎద్దు' అని ఏడిపిస్తా వుండేవాళ్లు నన్ను.

వాళ్లెంతగా ఏడిపించినా నేను అయితేమందిలే అనుకుంటా వుండేవాణ్ణిగానీ ఆ రోజు రమాదేవి టీచరు చేసిన అవమానానికి మాత్రం మండిపొయ్యింది.

తెలుగు రాకపోతే నాదా తప్పా? దానిని మా యింట్లో మాట్లాడము. మా కసాబ్‌గల్లీలో కూడా మాట్లాడము. పోనీలే పాపం అని ఇస్కూల్లో అందరిలాగా ఇంగిలీషూ తెలుగూ చదవడం రాయడం నేర్చుకుంటానే ఎగస్ట్రాగా తెలుగు మాట్లాడటం కూడా నేర్చుకుంటా వుంటే మా రమాదేవి టీచరు రొంతన్నా కనికరం లాకుండా అట్టా మాట్లాడేసిందే అని ఒళ్లు మరిగిపోయింది.

ఆ రోజు రాత్రి మా నాయినమ్మ పక్కలో పొణుకొని అంతా చెప్పుకొని ఏడ్చినాను. మా నాయినమ్మకు మండిపొయ్యి 'ఆ అమ్మతల్లికి మన బాష వచ్చుంటనా నీకు తెలుగు రావడానికా? వూరుకోరా అయ్యా' అని రమాదేవి టీచర్‌ని తిడతా నన్ను గట్టిగా

పొదుగుకునింది.

ఆ రాత్రంతా నాకు నిద్రే పట్టలా. ఏందేందో ఆలోచనలు. రమాదేవి టీచరు మీద ఎట్టా పగసాదిద్దామా అని చాలాసేపు ఆలోచించినాను. అట్టా ఆలోచిస్తా వుంటే తటక్కన గబ్బర్ సింగు గుర్తుకొచ్చినాడు.

ఆ నా కొడుకెవరో నాకు తెలియదు. వాడు మాట్లాడేది కూడా నాకు అర్దం కాదు. అయినాగానీ వాడి మాటలన్నీ నాకు కంటోపాటమే. డెకరేషను పని లేనప్పుడల్లా మా నాయిన రికార్డు ప్లేయరు యింటికితెచ్చి, తిప్పిచ్చి మళ్లిచ్చి గబ్బర్ సింగు మాటలే వింటా వుండేవాడు.

యానివసరీ డేకి ఆ డైలాగులు చెబితే?

బొంబాట్‌గా వుందనిపించింది ఐడియా!

మరసటి రోజు ఫస్టు పిరీడులో క్లవర్లందరూ రిహార్సల్సుకి వెళ్లినాక సైగ్గా లేచి నేను కూడా అవి జరిగే తాటాకు కొట్టంకాడికి వెళ్లినాను.

నన్ను చూడంగానే రమాదేవి టీచరు బెత్తమెత్తుకొని తరుముకోబోయే సరికి మీసాల సుబ్బరాజయివోరు నన్ను చూసేసినాడు. ఆయనప్పుడే మా క్లవర్ల రిహార్సల్సు చూడటానికని వచ్చినాడంట.

'ఏమిరా కరీం కొడకా! కిలాసు లా?' అన్నాడు నన్ను చూసి.

'వుందిగానీ నేను యాక్షను చేస్తాను సార్' అన్నాను రొంత బయంగా.

'ఏమి యాక్షనురా?' అన్నాడాయన మీసాల నిండుగా నవ్వతా.

'గబ్బర్ సింగు సార్. చేసేదా?' అని, ఆయనెక్కడ వొద్దంటాడోనని ఎమ్మటన్నే బీకరంగా గొంతు పెట్టి 'కితినే ఆద్మీ థే' అంటా మొదులుపెట్టినాను.

ఆణ్ణుంచి డైలాగులు కొడతా కొడతా, 'గోలీ ఖా' దాటుకొని, 'హహ్హాహోహో' అని గబ్బర్ సింగులాగా కళ్లమ్మట నీళ్లు తిరిగేంత సేపు నవ్వి, 'కబ్ హై హోలీ... హోలీ కబ్ హై' దాకా పొల్లు పోకుండా అప్పజెప్పేసరికి మా రమాదేవి టీచరుతో సహా అందరూ గుడ్లప్పగించి చూస్తా వుండిపొయ్యారు.

సుబ్బరాజయివోర్కైతే సంతోషంతో ఒళ్లు నిండిపొయ్యింది.

'శబ్బాష్‌రా కరీం కొడకా. యానివసరీకి యిదెయ్' అన్నాడు, యింకో మాట లేదన్నట్టుగా. రమాదేవి టీచరు నా తట్టూ సుబ్బరాజయివోరి తట్టూ మార్చిమార్చి చూసి

ఏమీ అనలాక గమ్మునైపోయింది.

యింకా సమచ్చరం మా యానివసరీడేకి క్లవరు నా కొడుకులంతా వేసిన నాటకాలు, చేసిన డాన్సాటలు, పాడిన 'వొదినకు ఒకసరి' పాటలు ఎటు కొట్టుకొని పోయినాయోగానీ నేనూ నా గబ్బర్ సింగు మాత్రం స్టేజు స్టేజంతా కుమ్ములో దుమ్ము చేసేసినాం.

ఆ దెబ్బతో మా ఆరో కిలాసు నుంచి గోదాలక్ష్మి రాకపోయినా, కళావాణి లేటుగొచ్చినా ప్రార్థన చేయించే చాన్సు మనదేనని వేరే చెప్పాలా?

